

ఓం నమోభగవతే శ్రీరమణాయ

# రమణ భాస్కర



సంపుటి : 4 సంచిక : 17 పుష్పం : 21,25 ఎడిటర్ : శ్రీమతి P.H.V. సత్యవతి (హైమ)

## (సద్గురు శ్రీ నాన్నగారి అనుగ్రహభాషణములు, 17-1-99, గరగపర్రు)

ప్రియమైన ఆత్మబంధువుల్లారా,

హృదయంలో శాంతి ఉంది, ఆనందం ఉంది అని చెపుతున్నారు. అది నాకు తెలియటం లేదు. మనస్సు నాకు తెలుస్తోంది. మనస్సే నేనుగా వ్యక్తమవుతోంది అని భగవాన్‌తో అంటే తెలియని గొడవ వదిలెయ్యి, తెలిసిన దానిని పట్టుకో. మనస్సు నీకు తెలుస్తోంది అంటున్నావు కదా దానిని బాగుచేసుకో అంటున్నారు. నాకు తెలుసును, నాకు తెలియదు అనేవి మనస్సుకు సంబంధించిన గొడవలు. అసలు వస్తువు ఈ తెలియటం తెలియకపోవటం అనేదానికి అతీతంగా ఉంది. మనస్సుకు విషయజ్ఞానం ఉంటుంది. విషయజ్ఞానానికి ఆత్మ ఎలా తెలుస్తుంది. ఆత్మను ధ్యానం చేయగా చేయగా దాని గుర్తులు మనకు తెలుస్తాయి. ఆత్మను స్మరించగా స్మరించగా ఆత్మ యొక్క వైభవం మనకు తెలుస్తుంది. కాని మనం విషయాలను స్మరిస్తున్నాము. విషయచింతన చేస్తూ ఉంటే ఆత్మ ఎలా తెలుస్తుంది, నీహృదయంలో ఉన్న శాంతి నీకు ఎలా తెలుస్తుంది. విషయచింతన చేయటం వలన వాటి పట్ల ఆసక్తి కలుగుతుంది, మనస్సు వెళ్ళి అటు వాలుతుంది. అక్కడ నుండి భోగదృష్టి కలుగుతుంది. ముముక్షువు విషయచింతన తగ్గించుకోవాలి.

మోక్షానుభవం మనకు ఎలాగూ లేదు మోక్షానుభవం మనకు లేకపోయినా ఆ మార్గం అయినా మనకు కనిపిస్తుందా అంటే అదీ మనకు కనబడటం లేదు. ఆ మార్గం ఎవడికి కనిపిస్తుంది అంటే మన జీవితంలో సంతోషం వచ్చినా, దుఃఖం వచ్చినా అదీ ప్రకృతే, ఇదీ ప్రకృతే. ఏది వచ్చినప్పటికి ఈ రెండింటిని ఎవడైతే సమానంగా అనుభవిస్తున్నాడో ఆ ఓర్పు, నేర్పు, సహనం ఎవడికైతే ఉందో వాడికి మోక్షమార్గం కనిపిస్తుంది, లేకపోతే మోక్షమార్గం కనపడదు. ఏదైనా కష్టం వచ్చినప్పుడు మా విధి ఇలా ఉంది అంటారు. ఆ విధిని అనుభవించటానికి ఒకడు ఉండాలి కదా ఆ అనుభవించేవాడిని తీసివేస్తే ఇంక వాడికి విధి ఏమిటి అన్నారు భగవాన్. మన సాధనలు అన్నీ, గానుగు ఎద్దులాగ ఉన్నాయి అన్నారు భగవాన్. దాని కళ్ళకు గంతలు కడతారు గంటలు తరబడి తిరిగి చాలా దూరం వచ్చేసాము అనుకుంటుంది కాని గంతలు విప్పితే అక్కడే ఉంటుంది. మన సాధనలు కూడా అలాగే ఉన్నాయి. కళ్ళకు గంతలు కట్టివేస్తే గానుగు ఎద్దు ఎలా చుట్టూ తిరుగుతూ ఉంటుందో అలాగే మనం కూడా పూజలు పేరు మీద, జపాల పేరు మీద, ధ్యానాలు పేరు మీద మిధ్యా

నేను చుట్టూ తిరుగుచున్నాము. నీవు ఏ మార్గంలో ప్రయాణం చేసినా ఈ మిథ్యానేను తొలగించుకోవాలి . కాని సాధనల పేరు మీద మిథ్యానేను చుట్టూ తిరుగుచున్నాము.

దేహం అంటే మనకు సరదాగా ఉంది. కాని అది జైలు అని మనకు తెలియటంలేదు. మనం దేహం అనే జైలులో ఉన్నాము. దేహం చనిపోయినప్పుడు ఆ జైలు నుండి బయటకు వచ్చేస్తాము అని మనకు అనిపిస్తుంది. కాని దేహం చనిపోయినప్పుడు జైలు నుండి బయటకు రాము. ఇంకో కొత్త జైలులో పడవేస్తారు. ఈ జైలు నుండి ఎప్పుడు విడుదల పొందుతాము అంటే నీవు కర్త లేని కర్మను ఆచరించేవరకు నీవు ఏదో జైలులో ఇలా పడి ఉండవలసిందే. దేహం ఉండగా మనం దేహాభిమానాన్ని పోగొట్టుకోవాలి. దేహం ఉండగా మనం ఈ దేహాభిమానాన్ని పోగొట్టుకోకపోతే కొత్త దేహం వచ్చిన తరువాత ఇప్పుడు ఈ దేహం మీద మనకు ఎలా అభిమానం ఉందో మరల ఆ నూతనదేహం మీద కూడా మనకు అలా అభిమానం ఉంటుంది. అంటే సాధన పేరు మీద మనం దేహాభిమానాన్ని తగ్గించుకోవాలి. మనం చేసేది నిర్మలంగా ఉండాలి, నిశ్చలంగా ఉండాలి, నిరాడంబరంగా ఉండాలి, నిరహంకారంగా ఉండాలి.

కొంతమంది ముసలివారు అంటూఉంటారు. మేము కుటుంబం కోసం చాలా కష్టపడ్డాము, చాలా సంపాదించాము అయినా ఎవరూ మమ్మల్ని పట్టించుకోవటం లేదు మాకు గుర్తింపు లేదు అని బాధపడుతూ ఉంటారు. పరమేశ్వరుడు చూస్తున్నాడు కదా వీరి గుర్తింపులు ఎందుకు. మీ దేహాలు ఎంత నిజమో వారి దేహాలు కూడా అంతే నిజం. మనం ఏ పని చేసినా ఈశ్వరప్రీత్యర్థం చేయాలి గాని ఈ గుర్తింపులు ఎందుకు. ఈ గుర్తింపులు అన్నీ ప్రకృతే. మిథ్యానేను ఎంత నిజమో ఈ గుర్తింపులు కూడా అంతే నిజం. గుర్తించారా లేదా అని వద్దు మీ చేతిలో ఉన్న పనిని చేసుకుంటూ వెళ్ళిపోండి. గుర్తించవచ్చు, గుర్తించకపోవచ్చు. గుర్తింపులు కోరుకుంటే వస్తే రావచ్చును, కాని ఈశ్వరానుగ్రహానికి పాత్రులు కారు. ఈశ్వరానుగ్రహం రావాలంటే గుర్తింపు వచ్చినా, రాకపోయినా మీ మనస్సు స్థిరంగా ఉండాలి, సమానంగా ఉండాలి. దేహం మరణించిన తరువాత మోక్షం వస్తుందని సామాన్యంగా అనుకుంటారు. మోక్షం అంటే అది కాదు. మోక్షం అంటే మనము ఉన్నాము అన్న సంగతి మనకు తెలుస్తూ ఉంటుంది. సుఖము, శాంతి, ఆనందం మనకు స్వరూపంగా వ్యక్తమవుతూ ఉంటుంది. అక్కడ వెలితి ఏమీ ఉండదు. అది మోక్షం. అది దేహం ఉండగానే పొందాలి. ఈ ఆధ్యాత్మిక మార్గంలో ప్రయాణం చేసేటప్పుడు బహుజాగ్రత్తగా ఉండాలి. ఏదో అడ్డదారుల ద్వారా ఇది పొందుదాము అనుకుంటున్నారు. దీనికి అడ్డదారులు లేవు. నీవు ఏ మార్గంలో ప్రయాణం చేసినా దేహాభిమానం పూర్తిగా నశిస్తే గాని మోక్షానుభవం కలుగదు.ఇది రికమండేషన్ చేసి పొందేది కాదు, అర్హతను బట్టి, యోగ్యతను బట్టి వస్తుంది. మన మనస్సు పవిత్రమైతే ఇప్పుడే ఇక్కడే వస్తువు మనకు వ్యక్తమవుతుంది. మన దైనందిన జీవితంలో మనస్సును పవిత్రం చేసుకోవటానికి కృషి చేయాలి. త్యాగి కాని వాడు జ్ఞాని కాలేడు. మనం దేహాభిమానాన్ని త్యాగం చేశాము అనుకోండి దానికి మించిన త్యాగం లేదు.

దుఃఖకారణం బయటలేదు నీలోపలే ఉంది. ఆ కారణం ఏమిటో నీవు వెతికి పట్టుకొని దానిని తొలగించుకోవాలి. ఆ ప్రయత్నం నీవే చేయాలి. నీబుద్ధిసూక్ష్మత అక్కడ ఉపయోగించుకోవాలి. నీవు ఎంతో కొంత ప్రయత్నం చేస్తేనే గాని ఆ బంధం తెగదు. గురువు నీకు సహాయం చేస్తాడు. నీవు చైతన్యభావన పెంచుకోవాలి. అది పెంచుకుంటూ ఉంటే జీవభావన దాని అంతట అదే పోతుంది. తల్లి చూడండి పిల్లలకు ఏది ఇష్టమో అది చేస్తుంది. తనకు ఇష్టం లేకపోయినా అదే తింటుంది. అలాగే మనం కూడా మన ఇష్టాన్ని ప్రక్కకు పెట్టి భగవంతునికి ఏది ఇష్టమో అది చేస్తూ ఉంటే ఈ జన్మలోనే ఇక్కడే మోక్షం వస్తుంది. దేహానికి పెట్టే ఆహారం మనం ఆపక్కరలేదు, దానికి యుక్తంగా పెట్టు. కాని దేహాభిమానానికి వెళ్ళే ఆహారాన్ని ఆపు చేస్తే దేహం ఉండగానే నీవు ఈశ్వర స్వరూపాన్ని పొందుతావు, జీవన్ముక్తుడవు అవుతావు.

## సద్గురు శ్రీ నాన్నగారి అనుగ్రహభాషణములు

**(15-2-99, విరుసుమర్రు)**

ప్రియమైన ఆత్మబంధువుల్లారా,

దేహం ఉండగానే జ్ఞానసముపార్జన కోసం మనం ప్రయత్నంచేయాలి. భగవంతుని యందు, భగవంతుడు చెప్పిన మాటయందు పరమప్రీతి కలిగిఉండాలి. భగవంతుడు చెప్పిన మాట నీకు ఇష్టం లేకపోయినా ఇష్టం చేసుకొని దానిని ఆచరించాలి. ఏదైతే మనకు శ్రేయస్సో అదే మనకు భగవంతుడు బోధిస్తాడు. కాని పాడుస్నేహాల వలన, ప్రకృతితో కలసిపోవటం వలన మనం పతనమయ్యాము. చెడుస్నేహాల వలన పచ్చగా ఉన్న సంసారములు పాడైపోతాయి. అందువలన స్నేహాల విషయంలో బహుజాగ్రత్తగా ఉండాలి. భగవంతుని అవతారములలో ఏదో ఒకదానిని మనం ఉపాసన చేయాలి. దానివలన మనో నిగ్రహం కలుగుతుంది.అప్పుడు మనస్సుకు అంతర్దృష్టి కలుగుతుంది.అంతర్ దృష్టి కలిగిన మనస్సుకు ఆత్మజ్ఞానం కలుగుతుంది. నీవు మనస్సు చెప్పినట్లు వినకూడదు. మనస్సు వాసనచేత ప్రేరేపింపబడి పని చేస్తుంది. నీ వాసనను, మనస్సును ప్రక్కన పెట్టి, దాని గమనాన్ని పట్టించుకోకుండా ఈశ్వరుడు ఏదైతే చెప్పాడో దానికి అనుగుణంగా జీవిస్తే నీకు జ్ఞానం కలుగుతుంది. మన దేశభక్తి నిజమైతే మన మనస్సు విశాలమవుతుంది అది దైవభక్తికి దారి తీస్తుంది. బుడగను ఊదుతూ ఉంటే అది పెద్దది అయి, పెద్దది అయి చివరకు పేలిపోతుంది. అలాగే మన దేశ భక్తి నిజమైతే మన కార్యరంగ పరిధి పెరుగుతుంది. మనస్సు విశాలమై చివరకు మనస్సు నశిస్తుంది. అప్పుడు భగవంతుడు నీకు స్వరూపంగా వ్యక్తమవుతాడు.నీవు

నోటితో భగవంతుని స్తోత్రం చేస్తున్నావు. కాని చేతితో భగవంతునికి ఇష్టమైన పనిని చేయటం లేదు. మనం నోటితో చెప్పేది ఒకటి, చేతితో చేసేది ఒకటి. మనకు లోపల సమన్వయం లేదు. భగవంతుడు చెప్పిన మాటలకు అనుగుణంగా నీ చేతితో పని చేసి చూపించు.పని చేసేటప్పుడు ప్రేమ కలిగిఉండు, భక్తి కలిగిఉండు, ఎరుక కలిగిఉండు. మనం ఏదైనా పని చేసేటప్పుడు భగవంతుడు మనకు ఈ అవకాశం ఇచ్చాడు కాబట్టి చేస్తున్నాము అని అనుకోవాలి గాని నేను చేస్తున్నాను అని అనుకోకూడదు. భగవంతుడు ఏదైనా అవకాశం ఇస్తే మనం చేయగలం గాని లేకపోతే మనం ఏమీ చేయలేము. నీ మనస్సు నిర్మలం అయితే గాని, నిశ్చలం అయితే గాని, వస్తువు యొక్క తత్వం తెలియదు. నోటితో తియ్యగామాట్లాడు. చేతితో పూజ చెయ్యి, మనస్సుతో ధ్యానం చెయ్యి. అప్పుడు నీ మనస్సు నిర్మలం అవుతుంది,నిశ్చలం అవుతుంది. అప్పుడు నీ హృదయంలో ఉన్న వస్తువు నీకు అవగాహన అవుతుంది.

నీవు పని చేసేటప్పుడు గుర్రంలాగ పని చెయ్యి, జీవించేటప్పుడు సన్యాసిలాగ జీవించు గుర్రం ఎంత చురుకుగా ఉంటుందో అంత చురుకుగా పని చెయ్యి. సన్యాసిలా జీవించు అంటే సన్యాసికి అవసరాలు ఏమీ ఉండవు, పని చేస్తాడు. మనం పని చెయ్యము అవసరాలు కావాలి. అలా కాకుండా తక్కువ అవసరాలతో జీవించు,ఎక్కువ పని చెయ్యి. మనం ఇంద్రియాలతో ఏ పని చేస్తున్నా మన మనస్సుకు అనుబంధం దేవునితో ఉండాలి. భగవంతునితో మానసికఅనుబంధం కలిగి ఉండాలి. నిన్ను ఏ పాత్ర పోషించమని భగవంతుడు ఈ భూమి మీదకు పంపాడో దానిని సక్రమంగా పోషించు. దానితో తాదాప్యం చెందకు. అప్పుడు నీ మనస్సుకు అంతర్దృష్టి కలుగుతుంది ఎక్కడైతే పరమేశ్వరుడున్నాడో అక్కడకు నీ మనస్సు కొంచెం కొంచెంగా జరుగుతూ ఉంటుంది. మనస్సు ఎక్కడైతే ఉదయించిందో అక్కడకు వెళ్ళి అది కరిగిపోతుంది. అప్పుడు నీవు ఎవడిగా ఉన్నావో ఆ వస్తువు నీకు వ్యక్తమవుతుంది. ఆ వస్తువు వ్యక్తమయ్యాక ఇప్పుడు నీవు ఎత్తిన జన్మలు అన్నీ స్వప్నంతో సమానం అని నీకు తెలుస్తుంది. దేహాన్ని ప్రారబ్దానికి విడిచిపెట్టు. నీవు ఆత్మజ్ఞాన సముపార్జనలో లగ్నమై ఉండు. దేనిని తెలుసుకున్నాక ఇంక తెలుసుకోవలసింది ఏదీ ఉండదో, ఏ సుఖాన్ని పొందిన తరువాత దానికి మించిన సుఖం గాని, దానితో సమానమైన సుఖంగాని లేదు అని నీకు తెలుస్తుందో అటువంటి సుఖాన్ని పొంది నీవు సుఖివి అవ్వు.

PRINTED & PUBLISHED BY P.S. RAMARAJU AT SHRIRAM GRAPHICS, PALAKOL